ఆంధ్రజ్యోతి
చిత్తూరు
మంగళవారం 15 అక్టోబరు 2024



మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ఉత్కంఠగా సాగింది. సోమవారం ఉదయం 8 గంటలకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది.వర్షం పడుతున్నా టెండరుదారులు సమయానికి చేరుకున్నారు. చిత్తూరులోని ఆర్.ఆర్.గార్డెన్స్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3.15 గంటల వరకు కలెక్టర్ సుమిత్ కుమార్ సమక్షంలోనే 104 మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ జరిగింది. 104 దుకాణాలకు 2266 దరఖాస్తులు రాగా ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్, ఈఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రశాంతంగా టెండర్ల ప్రక్రియ ముగిసింది.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

- 7గంటల్లో సాఫీగా ముగిసిన మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ



లాటరీ తీస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

లాటరీ లక్కు!

- భారీ బందోబస్తు

చిత్తూరు ఆర్‌ఆర్ గార్డెన్స్ కల్యాణమండపంలో నిర్వహించిన మద్యం దుకాణాల కేటాయింపు సమావేశానికి పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో డీఎస్పీ సాయినాథ్, చిత్తూరు టూ టౌన్, సీసీఎస్, ఈస్ట్, వెస్ట్, పూతలపట్టు, జీడీనెల్లూరు సీఐలు సహా సుమారు వందమంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. టెండరు ప్రక్రియలో పాల్గొన్న వారు లక్షలాది రూపాయల లైసెన్సు ఫీజు సొమ్ముతో హాజరైన కారణంగా పోలీసులు అలర్ట్‌గా ఉండాల్సి వచ్చింది.

రేపట్నుంచే దుకాణాలు ప్రారంభం

మద్యం దుకాణాలను దక్కించుకున్న వారంతా వాటిని నిర్వహించేందుకు అద్దె గదుల్ని సిద్ధం చేసుకుని, బుధవారం నుంచి కొత్త స్టాకు, మద్యంతో దుకాణాల్ని ప్రారంభించనున్నారు.



మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియకు హాజరైన టెండరుదారులు

రూ.56కోట్ల ఆదాయం

104 మద్యం దుకాణాలకు 2266 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున డీడీ రూపంలో టెండరుదారులు చెల్లించారు. ఇది నాన్ రీఫండబుల్ పేమెంట్. దీంతో జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా రూ.45.32 కోట్ల ఆదాయం సమకూరింది. సోమవారం దుకాణాల్ని దక్కించుకున్నవారు తొలి విడత రూ.10.70 కోట్లను చెల్లించారు. మొత్తంగా రూ.56.02 కోట్ల ఆదాయం వచ్చింది.

లాటరీ నిర్వహించిన తీరు ఇలా...

జిల్లాలోని 8 ఎక్సైజ్ స్టేషన్ల వారీగా మద్యం దుకాణాల టెండర్లు పిలిచారు. చిత్తూరు అర్బన్ స్టేషన్ పరిధిలో 22, చిత్తూరు రూరల్- 19, కార్వేటి నగరం, నగరి- 11, పుంగనూరు -14, పలమనేరు- 13, కుప్పం- 10, పులిచెర్ల స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు లాటరీ నిర్వహించారు. కలెక్టర్ సమక్షంలో దుకాణాల నెంబర్లు, వాటికి దరఖాస్తు చేసుకున్న టెండరుదారులను పేరు పేరునా పిలిచి వారికి కేటాయించిన టోకెన్ నెంబర్లను చూపిస్తూ స్టీల్ బాక్స్‌లో వేశారు. కలెక్టర్ బాక్స్‌లో నుంచి ఒక టోకెన్‌ను తీసి దుకాణదారును ఎంపిక చేశారు. అదే దుకాణానికి రిజర్వు క్యాండిడేట్లుగా మరో రెండు టోకెన్లను తీశారు. ఒకవేళ లక్కీ డిప్‌లో టెండరు దక్కించుకున్న వ్యక్తి డబ్బు చెల్లించకపోతే మొదటి రిజర్వు టెండరుదారుకు మద్యం దుకాణం కేటాయిస్తారు.ఆయన కూడా చెల్లించపోతే రెండో రిజర్వు టెండరుదారుకు అవకాశం కల్పిస్తారు. 104 మద్యం దుకాణాలకు 2266 మంది టెండరుదారులను పిలిచి వారి సమక్షంలోనే లాటరీ తీసి దుకాణాలను కేటాయించారు. దుకాణం దక్కించుకున్న వారంతా ఒక సంవత్సరం లైసెన్స్ ఫీజును 6 దఫాలుగా చెల్లించుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం నిర్ణయించిన రూ.65 లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సిన వారు అందులో ఆరోవంతు రూ.10,83,333.. రూ.55 లక్షలు చెల్లించాల్సిన వారు రూ.9,16,666.. దుకాణాలను దక్కించుకున్నవారు తొలి విడత చెల్లించేశారు.రెండు నెలలకోసారి ఈ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి వుంటుంది.

ముగ్గురికి రెండేసి దుకాణాలు

మద్యం దుకాణాలకు చాలామంది బృందాలుగా ఏర్పడి 10, 20, 30 చొప్పున దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో చాలామందికి దుకాణాలు దక్కకపోవడంతో నిరాశతో వెనుదిరగ్గా ముగ్గురికి రెండేసి దుకాణాలు దక్కాయి. చిత్తూరులో రూప్‌సాగర్, బంగారుపాళ్యంలో పల్లవి, నగరిలో సాయి ధనుష్ రెండేసి దుకాణాలను పొందారు.

12 దుకాణాలు మహిళలకు

మద్యం దుకాణాల్లో 12 మహిళలకు దక్కాయి.చిత్తూరు నగరంలో యామిని, కీర్తన, బంగారుపాళ్యంలో పల్లవి (2 దుకాణాలు), ఐరాలలో లక్ష్మి, వెదురుకుప్పంలో పార్వతి, శాంతమ్మ, బైరెడ్డిపల్లెలో భారతి, గుడుపల్లెలో ప్రభావతి, శాంతిపురంలో పుష్ప, రామకుప్పంలో ధనలక్ష్మి, పులిచెర్లలో సరస్వతి దుకాణాలను దక్కించుకున్నారు.

బలిజకండ్రిగ విన్నర్ వాసు నాయుడు

పాలసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని బలిజకండ్రిగ వైన్‌షాపు టెండర్ దక్కించుకోవడానికి అత్యధికంగా 82మంది పోటీపడ్డారు. పాలసముద్రం మండలవాసులతో పాటు ఇతర మండలాలకు చెందిన వారు, తమిళనాడువాసులు ఎక్కువమంది దరఖాస్తు చేసుకున్నారు.ఈ వైన్‌షాపు తమిళనాడుకు సరిహద్దులో ఉండటం వల్ల భారీఎత్తున వ్యాపారం జరిగే అవకాశముండడంతో ఎక్కువమంది పోటీపడ్డారు.వీరిలో గంగాధరనెల్లూరు మండలం కొత్తవెంకటాపురం గ్రామానికి చెందిన వాసునాయుడిని లాటరీ వరించింది.

లాటరీ కిక్కు తగలక తెలుగు తమ్ముళ్ల డీలా

నగరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల లాటరీలో తెలుగు తమ్ముళ్లకు చుక్కెదురైంది.నగరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 11 మద్యం దుకాణాలుండగా, స్థానికులకు మూడు దుకాణాలు మాత్రమే దక్కాయి. దీంతో తెలుగు తమ్ముళ్లంతా నిరాశపడ్డారు.



బలిజకండిగ వైన్‌షాపును దక్కించుకున్న వాసునాయుడితో మాట్లాడుతున్న కలెక్టర్

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

చిత్తూరు (సెంట్రల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు మంగళ, బుధవారాలు సెలవులు ప్రకటిస్తున్నట్లు డీఈవో దేవరాజు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ, విపత్తు నిర్వహణ శాఖల ముందస్తు హెచ్చరికలతో కలెక్టర్ సుమిత్ కుమార్ పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు ఆదేశాలు జారీ చేశారు. తుఫాను కారణంగా పాఠశాలలకు ఏదైనా నష్టం జరిగితే డీఈవో, ఎంఈవో, సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయాల్లో సంప్రదించాలని డీఈవో సూచించారు.

జిల్లావ్యాప్తంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. మండలాల వారీగా.. తవణంపల్లెలో 24.2, రామకుప్పంలో 22.4, నిండ్రలో 18.6, ఐరాలలో 17.8, విజయపురంలో 17.2, నగరిలో 16.8, కార్వేటినగరంలో 16.8, శాంతిపురంలో 15.2, పాలసముద్రంలో 14.4. పూతలపట్టులో 13.6, పులిచెర్ల, యాదమరిలో 13.2, గుడిపాలలో 11.8, జీడీ నెల్లూరులో 11, చిత్తూరు రూరల్‌లో 10.8, సోమలలో 10.4, చిత్తూరు అర్బన్‌లో 10.2, బంగారుపాళ్యంలో 9.6, వెదురుకుప్పంలో 9.2, రొంపిచెర్లలో 8.4, సదుం, చౌడేపల్లె, పెద్ద పంజాణిలో 8.2, గంగవరంలో 7.6, పలమనేరులో 7.2, వి.కోటలో 5.8, ఎస్‌ఆర్‌పురంలో 5.4, పెనుమూరు, బైరెడ్డిపల్లెలో 3.8, పుంగనూరులో 2.8, గుడుపల్లెలో 2.4, కుప్పంలో 2.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



చిత్తూరులో కురుస్తున్న వర్షం

సీతమ్మ చెరువు కట్టను మళ్లీ కడితేనే....!

- ప్రాజెక్టు మెటీరియల్ తీసుకెళ్లనిస్తామంటూ పీఎల్‌ఆర్ కంపెనీని అడ్డుకున్న రైతులు
- 7గంటలపాటు ఆవులపల్లెలో వివాదం
- నేడు నిరసనలకు సిద్ధమైన రైతులు



ఆవులపల్లెలో పోలీసులతో మాట్లాడుతున్న రైతులు

పుంగనూరు/సోమల, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ఉత్తర్వులున్నా పట్టించుకోకుండా సీతమ్మ చెరువుకట్ట తెంచిన పీఎల్‌ఆర్ కంపెనీ మళ్లీ చెరువుకట్ట పునరుద్ధరించేంతవరకు మెటీరియల్ తరలించరాదంటూ రైతులు పట్టుబట్టారు. సోమవారం ఉదయం 11గంటలకు సోమల మండలం ఆవులపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్, సోమల ఎస్‌ఐ శివశంకర్, పీఎల్‌ఆర్ కంపెనీ ప్రతినిధులు ప్రాజెక్టు కోసం ఉంచిన కమ్మి తీసుకెళ్లడానికి నాలుగు లారీలు తీసుకొచ్చారు.ఈ విషయం తెలియగానే పత్రపల్లె, ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, దేవళకుప్పం, మల్లేశ్వరం తదితర గ్రామాలకు చెందిన రైతులు అక్కడికి చేరుకున్నారు.మా చెరువు కట్ట మళ్లీ నిర్మించేంతవరకు ఎలాంటి మెటీరి యల్ తీసుకెళ్లడానికి వీల్లేదని భీష్మించారు.పీఎల్‌ఆర్ కంపెనీకి మెటీరియల్ తీసుకెళ్లడానికి హైకోర్టు అనుమతించిందని, కాబట్టి తాము ప్రొటెక్షన్ ఇవ్వాల్సివుందని చెప్పడంతో రైతులు ఎదురు తిరిగారు.ప్రాజెక్టు పనులు చేయరాదని ఎన్జీటీ స్టే ఇచ్చినా అధికార బలంతో రైతులపై తప్పుడు కేసులు పెట్టి భయపెట్టి దౌర్జన్యంగా సీతమ్మ చెరువు కట్టను 2022 అక్టోబరు 14వ తేది తెంచేశారని, అప్పుడు కోర్టు ఆర్డర్ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.అప్పుడు కోర్టు వద్దన్నా తెంచేసిన కట్ట కడితేనే ఇప్పుడు మెటీరియల్ తీసుకెళ్లవచ్చని, లేకపోతే రైతులను చంపేసి తీసుకెళ్లండంటూ పోలీసులకు దండం పెట్టి న్యాయం చేయాలని కోరారు. వందల మంది రైతులకు అన్యాయం జరిగిఉంటే మీరు వారివైపు మాట్లాడితే ఎలాగని ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం 6గంటల వరకు వివాదం కొనసాగింది. గతంలో మెటీరియల్ కోసం వచ్చిన వారికి కట్ట మళ్లీ కట్టించాలని, ఇరిగేషన్ అధికారులను తీసుకురావాలని స్పష్టంగా చెప్పడంతో వారు అంగీకరించిన విషయం గుర్తు చేశారు. ఈ రోజు అధికారులు రాకుండా మెటీరియల్ తీసుకెళ్లడం కుదరదని పట్టుబట్టారు.శుక్రవారం వరకు తమకు గడువు ఇవ్వాలని, అధికారులతో మాట్లాడిన తర్వాత మెటీరియల్ తీసుకెళ్లవచ్చని రైతులు చెప్పారు. సీఐ ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించగా పీఎల్‌ఆర్ కంపెనీ ప్రతినిధి వెంకటరెడ్డి వ హాట్లా డుతు హా రైతులు కూడా చెరువుకట్ట కట్టాలని కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెస్తే తాను కూడా టెండర్ వేస్తానన్నారు.అయితే అది తమ పని కాదన్న రైతులు తాము న్యాయంగా చెరువు కట్టకట్టాలని మాత్రమే అడుగుతున్నామని చెప్పారు.వైసీపీ ప్రభుత్వంలో మీరు రైతులకు నరకం చూపారని, గతంలో ఇరిగేషన్ అధికారులను తీసుకొస్తామని చెప్పి ఇప్పుడు మీరే వస్తే ఎలాగని ప్రశ్నించగా అప్పటి అధికారులు ఎవరూ లేరని, అందరూ బదిలీ అయ్యారని, అధికారులు వచ్చినా ఎన్జీటీ స్టే వల్ల ఎవరూ ఏమీ చేయలేరన్నారు.పలమనేరు డీఎస్పీ ఫోన్ చేసి సోమవారం మెటీరియల్ కోసం లారీలు తీసుకురావాలని చెప్పడంతోనే తాము కోర్టు ఆర్డర్‌తో వచ్చామని, కోర్టు ఆర్డర్‌ను పోలీసులు అమలు చేసి లారీల్లో మెటీరియల్ తీసుకెళ్లడానికి సహకరించాలని వెంకటరెడ్డి కోరారు. కట్ట తెగిపోవడంతో దాదాపు 200 ఎకరాల భూములు నీరులేక బీళ్లుగా మారాయని, దాదాపు 50 బోర్లు ఎండిపోయాయని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. గతంలో ఎన్జీటీ ఆర్డర్ అమలు చేయరు కానీ ఇప్పుడు మాత్రం కోర్టు ఆర్డర్ అంటూ రైతులను ఇబ్బంది పెట్టడం సమంజసం కాదన్నారు. దీంతో పాత విషయాలు వద్దన్న సీఐ నాలుగు రోజులు గడువు ఇవ్వాలని రైతులు కోరుతున్నట్లు వెంకటరెడ్డికి చెప్పారు.చివరకు మంగళవారం మెటీరియల్ తీసుకెళతారని పోలీసులు చెప్పి వెళ్లిపోవడంతో మంగళవారం పెద్దఎత్తున ఆవులపల్లె వద్దకు చేరుకుని నిరసన వ్యక్తంచేయాలని రైతులు నిర్ణయించుకున్నారు. గత ఐదేళ్ల తమపై అనేక తప్పుడు కేసులు పెట్టి బెదిరించి నరకం చూపారన్న రైతులు మాకు కావాల్సిందిల్లా సీతమ్మ చెరువు కట్టను పునర్నిర్మించి కాంట్రాక్టర్ మెటీరియల్ తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.



పీఎల్‌ఆర్ కంపెనీ ప్రతినిధితో మాట్లాడుతున్న రైతులు

బీ అలర్ట్

- శిథిలావస్థలో వున్న ఇళ్లను గుర్తించండి
- వాగులు, వంకల వద్ద అప్రమత్తం చేయండి
- వానముప్పుపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించండి. అక్కడున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోండి' అని రెవెన్యూ అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో భారీ వర్షాలపై సమీక్షించారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎస్పీ మణికంఠతో కలిసి ఆర్డీవోలు, తహసీలార్లు, ఎంపీడీవోలకు ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలుగా వెంటనే గుర్తించాలని చెప్పారు.మండలాల వారీగా చెరువు,కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి సారించి.. వాగులు, వంకల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలిచ్చారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారుల వెంట చెట్లు విరిగి పడితే ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా చూసుకోవాలని చెప్పారు. అన్నిరకాల ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీల్లో ఈదురు గాలులకు ఫ్లెక్సీలు పడిపోయే అవకాశం ఉందని, వాటిని తొలగించాలని సూచించారు.పీఆర్ ఎస్‌ఈ శంకరనారాయణ,జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పాఠశాల పైకప్పు



భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాలసముద్రం మండలంలోని శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు శనివారం కూలింది. సుమారు 20 ఏళ్ల కిందట నిర్మించిన పాఠశాలలోని ఓ తరగతి గది పైకప్పు కొన్నినెలలుగా పెచ్చులూడుతోంది. దీంతో టీచర్లు ఆ గదికి తాళాలు వేసి ఉంచారు. వర్షాలకు పైకప్పు తడిసి కూలిపోయింది. పాఠశాలకు సెలవులు ఉండటంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి స్థానిక ఎంఈవో తీసుకెళ్లారు. ఎస్‌ఎస్ ఈఈ మధుసూదన్‌రావు సోమవారం పాఠశాల వద్దకొచ్చి భవనాన్ని పరిశీలించారు. కూలిపోయిన గదిని తొలగిస్తామని తెలిపారు. ఆయనవెంట ఎంఈవో రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం వెంకటేశులు ఉన్నారు.



ఒకవైపు వర్షం. మరోవైపు అర కి.మీపైగా క్యూలైను. ఇలా నగరిలో సోమవారం ఇండేన్ గ్యాస్ సిలిండర్లు తీసుకోవాల్సి వచ్చింది. నగరి, నిండ్ర, విజయపురం మండలాల పరిధిలోని 7500 మంది వినియోగదారులు తరచూ ఇలా అవస్థలు పడుతూనే వున్నారు. అధికారులకు చెబితే సిలిండర్లు సక్రమంగా రాకపోవడంతో తామేమి చేయలేకపోతున్నామని చెబుతున్నారని వినియోగదారులు అంటున్నారు.

- నగరి, ఆంధ్రజ్యోతి



తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనార్థం సోమవారం వచ్చిన కర్ణాటక భక్తురాలు మమతా ఆనంద్ క్యూలైన్‌లో హ్యాండ్ బాగ్ పోగొట్టుకున్నారు. ఇది మరో భక్తురాలికి దొరికింది. దర్శనం తరువాత హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదని బాధితురాలు విజిలెన్స్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఆ బ్యాగు తీసుకున్న మహిళను గుర్తించి ఇప్పించారు. అందులో రూ.54.200నగదు, బ్యాంకు కార్డులు ఉన్నాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



తమ వీధిలో మద్యం దుకాణం వద్దని పాత బలరాం థియేటర్ వీధివాసులు ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. గతంలో బలరాం థియేటర్ మార్గంలో మద్యం దుకాణం ఉండేదని దాన్ని తొలగించాలంటూ పోరాటం చేశామన్నారు. హైకోర్టు ఆదేశాలతో దుకాణాన్ని తొలగించినట్లు తెలిపారు. అయితే మళ్లీ ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసిందన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తిరుపతి రుయాస్పత్రిలో పురిటి బిడ్డలకూ అవస్థలు తప్పడం లేదు. ప్రసూతి ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ లేదు. దీంతో అక్కడి పిల్లలను రుయా ఏడీ భవనంలో ఉన్న కేంద్రానికి తీసుకొస్తున్నారు. ఇక్కడ సాధారణ, అత్యవసర చికిత్స పొందే రోగులతోపాటు శిశువులకూ స్కానింగ్ చేయాల్సి రావడంతో, గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. పురిటి బిడ్డలుండే వార్డులోనే స్కానింగ్ ఏర్పాటుపై అధికారులు పట్టించుకోవడం లేదు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

మన సంపద

దొంగలమండపం



కరకంబాడి రోడ్డులో అన్నమాచార్య కాలేజీ వెనుక వెంకటాపురం చెరువులో ఈ పురాతన మండపం కనిపిస్తుంది. ఎవరు కట్టించారో, ఏ కాలంనాటిదో గానీ శిల్పశోభితమైన రాతి స్తంభాలతో, దూలాలతో శిథిలస్థితిలో ఉంది. శ్రీరాముడు, మురళీకృష్ణుడు, శ్రీ వేంకటేశ్వరుడు, బలరాముడు, ఆంజనేయస్వామి, గరుడ, నటరాజ వంటి దేవతామూర్తుల బొమ్మలు, శంఖు, చక్రం, నామం, పద్మాకృతులు ఈ మండపం స్తంభాలమీద ఉన్నాయి. 16 స్తంభాల్లో ఒకటి కూలిపోయింది. పైన మొలచిన మొక్కలు వృక్షాలుగా మారి మండపం బీటలువారింది. దీన్ని ఈ ప్రాంతంలో దొంగలమండపం అని పిలుస్తారు. ఊరికి దూరంగా విసిరేసినట్లు ఉండే ఈ మండపంలో ఒకప్పుడు దొంగలు తలదాచుకునేవారని అంటారు. నిజానికి ఇది తిరుమల కొండకు కాలినడకన దూరప్రాంతాల నుంచీ వచ్చే భక్తులు సేదదీరేందుకు విజయనగర కాలంలో నిర్మించిన దారి మండపం కావచ్చు.



పురాతన చరిత్రక సంపద పట్ల మన నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నట్టుగా అలనాటి వైభవానికి శిథిలసాక్ష్యంగా ఇప్పుడు కనిపిస్తోంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి





హత్యకేసులో నిందితుడి లొంగుబాటు



నిందితుడిని చూపుతున్న సీఐ కిషోర్‌బాబు

చిల్లకూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తొణుకుమాల సమీపంలో ఇటీవల జరిగిన వెంకటేశ్వర్లు హత్య కేసులోని నిందితుడు అంకయ్య సోమవారం లొంగిపోయినట్లు సీఐ కిషోర్‌బాబు సోమవారం తెలిపారు. దక్కిలి మండలం దగ్గవోలు గ్రామానికి చెందిన అంకయ్య, అతడి భార్య లక్ష్మమ్మ, సైదాపురం బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, అతని భార్య సుబ్బమ్మ తొణుమాల సమీపంలోని అరుణమ్మకు చెందిన మామిడి తోటలో కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. మద్యానికి బానిసలై జల్సాలకు అలవాటుపడి వీరు పొలాల్లో విద్యుత్‌మోటారు వైర్లను చోరీ చేసి విక్రయించేవారు. సెప్టెంబరు 9వ తేదీ రాత్రి మోటారు చోరీ చేసి, అందులోని వైరును పంచుకునే విషయంలో అంకయ్య, వెంకటేశ్వర్లుకు మధ్య వివాదం ఏర్పడింది. అంకయ్య గడ్డపారతో దాడి చేయడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మామిడి తోటకు సమీపంలోని తెలుగుగంగ కాలువ కట్టపై పూడ్చిపెట్టి అంకయ్య పరారయ్యాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడు అంకయ్య సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అధికారుల సమక్షంలో లొంగిపోయినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది ఆర్‌పీ రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

తడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అపాచీలో కార్మికురాలి హత్య కేసులో నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. చిట్టమూరు మండలం కుమ్మరిపాళెం గ్రామానికి చెందిన గొంజి వనజ అపాచీ పరిశ్రమలో పనిచేస్తుండేది. గత శుక్రవారం విధుల్లో ఉన్న ఆమెను.. అదే గ్రామానికి చెందిన మీజూరు సురేష్ కత్తెరతో దాడిచేసి హత్యచేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పరారీలో ఉన్న సురేష్‌ను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపరచిన ఎస్‌ఐ కొండపనాయుడు, సిబ్బందిని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అభినందించారు. రివార్డు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన కారు



తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో సోమవారం సాయంత్రం ఓ కారు అదుపు తప్పింది. అదృష్టవశాత్తు కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. తమిళనాడుకు చెందిన ఓ భక్తబృందం శ్రీవారి దర్శనం ముగించుకుని తమ కారులో సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈమేరకు మార్గంలోని వినాయకస్వామి ఆలయం వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న చిన్నపాటి గట్టును ఢీకొని ఆగిపోయింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. కారులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు



ఎస్పీ చేతుల మీదుగా రివార్డులు అందుకుంటున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు విలువైన సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందిని సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వారికి నగదు రివార్డులు, ప్రశంసా పత్రాలు అందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావు, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, సాయుధ దళం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

విపత్తును ఎదుర్కొనేలా సంసిద్ధంకండి

● టీటీడీ అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో విపత్తులను ఎదుర్కొనేలా సంసిద్ధంగా ఉండాలని టీటీడీ అధికారులను ఈవో శ్యామలరావు ఆదేశించారు. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి సోమవారం ఆయన అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈప్రణాళికను మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈవో స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అదనపు ఈవో ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్యశాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు, తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండ చరియలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఘాట్‌రోడ్లలో ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఐటీ విభాగం కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అంబులెన్సులను అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలన్నారు. ఘాట్‌రోడ్డుల్లో ఎక్స్‌కవేటర్లు, ట్రక్కులు, ట్రాక్టర్లు, తగిన సిబ్బందిని సంసిద్ధంగా ఉంచుకుని సమాయత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర అధికారులు, జిల్లా పోలీసుల, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే పోలీసులకూ సమాచారం ఇవ్వండి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న క్రమంలో పోలీసులు అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం డయల్ 112, లేదా పోలీసు వాట్సాప్ నెంబరు 80999 99977కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. రైల్వే అండర్ బ్రిడ్జిల కింద వెళ్ళకూడదని, పాత భవనాల్లో వుండే వాళ్ళు వెంటనే ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన

తిరుపతి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో వరద ముంపు ప్రాంతాల ప్రజలకోసం పునరావాస కేంద్రాలను అధికారులు సోమవారం పరిశీలించారు. పేరూరు హరిపురం కాలనీలోని శ్రీచైతన్య స్కూల్, వెంకటపతి నగర్‌లోని పాఠశాలను తహసీల్దారు రామాంజులనాయక్, ఎంపీడీవో రామచంద్ర సందర్శించారు. భారీ వర్షాలు కురిస్తే వీటిలో రిహాబిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు.

కరెంటు సరఫరా పర్యవేక్షణకు

నోడల్ ఆఫీసర్లు

● డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూములు

● సీఎండీ సంతోషరావు వెల్లడి

తిరుపతి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాను హెచ్చరికలతో సదరన్ డిస్కం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. డిస్కం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. సర్కిల్, డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను తాకవద్దని, కరెంట్ లైన్ల కింద నిలబడవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ స్తంభాలు కూలినా.. తీగలు తెగినా తక్షణమే సమీప అధికారులకు, సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు.

కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుపాను ప్రభావం అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం 33కేవీ ఆర్డీవో ఆఫీస్ సబ్‌స్టేషన్, న్యూమారుతీనగర్, ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కరెంటు సమస్యా.. ఫోను చేయండి

టోల్‌ఫ్రీ నెంబరు: 1912-1800425155333

వాట్సాప్ నెంబరు: 91333 31912

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.56 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 86,900 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 28,739 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

17 నాటికి విజన్ డాక్యుమెంట్ సిద్ధం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఈనెల 17 నాటికి సిద్ధమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ వర్చువల్ విధానంలో కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ వివరిస్తూ రాబోయే ఐదు సంవత్సరాలకు సంబంధించిన మండల విజన్ డాక్యుమెంట్ పూర్తయిందన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ పురోగతిలో ఉందని, 17వ తేదీ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు.

రేపు రుయాలో పాలియేటివ్ కేంద్రం ప్రారంభం

తిరుపతి(వైద్యం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రుయాస్పత్రిలో బుధవారం 10 పడకలతో ప్రత్యేక పాలియేటివ్ (ఉచిత ఉపశమన సంరక్షణ) కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. రోటరీ క్లబ్ సహకారంతో ఈ కేంద్రాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఆయన సోమవారం రోటరీ క్లబ్ నిర్వాహకులతో సమీక్షించారు. ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని, వృద్ధులు, క్యాన్సర్ బాధితుల కోసం దీన్ని ప్రారంభిస్తున్నా మని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ మీట్‌కు తిరుపతికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 18, 16, 14విభాగాలలో బి.గణేష్‌ప్రియవర్ధన్(డిస్కస్‌త్రో), బి.ప్రణీత్‌కుమార్, కె.హరిచరణ్(షాట్‌పుట్), బి.శర్మి(ట్రైయాతిలాన్) ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా తరఫున ఎంపికయ్యారు. వీరు ఈనెల 17నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగే 35వ సౌత్‌జోన్ నేషనల్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటారు. అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గిరిధర్‌రాజు, రాబర్ట్ వారిని అభినందించారు.

అప్రమత్తంగా ఉండండి

కాలువలపై అక్రమ నిర్మాణాలు తొలగించండి



తిరుపతి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని, అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం పడడంతో అధికారులతో కలసి నగరంలో పలుచోట్ల ఆమె పర్యటించారు. పేరూరు చెరువు నుంచి నీరువచ్చే ప్రాంతాలు, కపిలతీర్థం, మాల్వాడి గుండం నుంచి నీరు వెళ్లే ప్రాంతాలతో పాటు లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే రెండు రోజుల్లో వర్ష సూచన ఎక్కువగా ఉందని, నీరు నిలబడకుండా, రోడ్డుపైకి రాకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలన్నారు. కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాస్ చెరువులో అక్రమంగా నిర్మాణాలు ఉన్నాయని చెప్పడంతో పరిశీలించారు. సర్వే చేసి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఆర్డీవో రామ్మోహన్, ఎస్ఈ శ్యాంసుందర్, ఇరిగేషన్ ఎస్ఈ శివారెడ్డి, అర్బన్, రూరల్ తహసీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజుల నాయక్, ఎంఈలు తులసీకుమార్, గోమతి తదితరులు ఉన్నారు.

● హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోండి

వర్షాల వల్ల ఏదైనా ఇబ్బంది కలిగితే 0877 2256766 హెల్ప్‌లైన్ నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటరును ఆమె పరిశీలించారు.

వెంకన్న భక్తులకు మెరుగైన సేవలు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు మెరుగైన సేవలందించామని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ, పోలీసు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికుల సమష్టి కృషితో ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం వచ్చిందని తెలిపారు. గరుడసేవ రోజున చిన్నపాటి పొరపాటు లేకుండా ప్రశాంతంగా ట్రాఫిక్ నడిచిందని గుర్తు చేశారు. అన్ని విభాగాల సమష్టి కృషి ఫలితంగానే బ్రహ్మోత్సవాలు విజయవంత మయ్యాయని పేర్కొన్నారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



కలెక్టరేట్‌లో నేటి పీజీఆర్ఎస్ రద్దు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో మంగళవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని భారీ వర్షాల కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలు కోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని సూచించారు.

డీపీవోలో నేడు పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం(డీపీవో)లో మంగళవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో బాధితులు నేరుగా వచ్చి సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు


ప్రసంగిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు సూచించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం తన చాంబర్‌లో రూరల్ డివిజన్ కార్యాలయంలోని సిబ్బందితో సమీక్షించారు. తుఫాను కారణంగా తలెత్తే విపత్కర పరిస్థితులు సరిచేయడానికి ఎనిమిది డివిజన్లలోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. 100 విద్యుత్ స్తంభాలు అందుబాటులో ఉంచుకోగా, వ్యవసాయానికివాడే వంద ట్రాన్స్‌ఫార్మర్లు అనంతపురం, కడప జిల్లాలనుంచి తెప్పించామన్నారు. లోతట్టు ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన 40 జనరేటర్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఎక్కడైనా విద్యుత్ సమస్య ఏర్పడి తీగలు తెగినా, ఫీజ్ కాలిపోయినా అత్యుత్సాహంతో స్థానికులు మరమ్మతులు చేయరాదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి 94408 17412 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. అలాగే చిత్తూరు అర్బన్‌లో 94408 17419, రూరల్‌లో 94910 52934 నెంబరులో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

యూజీ, పీజీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

గుడుపల్లె, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి 14 నుంచి 25 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల తెలిపారు. ద్రావిడ విశ్వవిద్యాలయాల భాగస్వామ్య రాష్ట్రాల కోటాకు సంబంధించి మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కోసం దరకాస్తులు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. పూర్తి వివరాలకు ద్రావిడ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ (డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ. ద్రావిడియన్ యూనివర్సిటీ.ఏసీ.ఇన్)ను సందర్శించాలని కోరారు.

కారు బోల్తా.. యువకుడి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



శాంతిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో సోమవారం తెల్లవారుజామున కడపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు .. శాంతిపురం మండలం రాళ్లబూదుగూరుకు చెందిన జమీర్‌అహ్మద్, మహమ్మద్ సిద్దిక్‌లు తమిళనాడుకు చెందిన లోకేష్, వర్తనంపల్లెకు చెందిన తరుణ్ కారులో కుప్పం వైపు వెళుతుండగా కారు అదుపుతప్పి కడపల్లె వద్ద రోడ్డు పక్కన ఉన్న దిమ్మెకు ఢీకొని పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో జమీర్ అహమ్మద్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు 108లో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మహమ్మద్ సిద్ధిక్ పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభమైన పల్లె పండుగ

తొలి రోజు 51 గ్రామ పంచాయతీల్లో సభలు ● చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి ఎమ్మెల్యేల హాజరు
● రూ.4.15 కోట్ల అంచనాతో 75 పనులు ప్రారంభం


ముట్టుకూరులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రతిష్ఠాత్మకంగా సోమవారం నుంచి పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించింది. వారం పాటు సభలు నిర్వహించి.. అభివృద్ధి పనుల్ని ప్రారంభించనున్నారు. తొలి రోజున 17 మండలాల్లోని 51 పంచాయతీల్లో పల్లెపండుగ నిర్వహించారు. 1,225 పనులకుగాను తొలి రోజున రూ.4.15 కోట్లతో 75 పనులకు ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవాలు చేశారు. 1,187 సీసీ రోడ్ల పనులకు 48, ఏడు బీటీ రోడ్ల పనులకు ఒకటి, ఎనిమిది ట్యాంకు పనుల్లో ఒకటి, ఇతర 11 పనులకు ప్రారంభించారు.నగరి నియోజకవర్గంలోని వీకేఆర్‌పురంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పాల్గొని, రూ.4లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యేతోపాటు డ్వామా పీడీ రవికుమార్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ● చిత్తూరు రూరల్ మండలం ముట్టుకూరు గ్రామ పంచాయతీలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ● గంగాధరనెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే థామస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమెల్యేలు మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత నెల 14వ తేదీన జరిగిన గ్రామ సభల్లో తీసుకున్న నిర్ణయాలను గౌరవిస్తూ.. ప్రభుత్వం ఆమోదం తెలిపి, అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పల్లెల రూపురేఖలు మారనున్నట్లు తెలిపారు. డ్వామా, గ్రామ పంచాయతీ అధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటలను ధ్వంసం చేస్తోన్న గజరాజులు

వరికి అపార నష్టం - మొక్కుబడి నష్టపరిహారం చెల్లిస్తున్నారంటున్న రైతులు


ఏనుగులు తొక్కేసిన వరి


విరిచేసిన రాతి కూసాలు

కల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పంటలపై ఏనుగులు వరుస దాడులు చేస్తూ రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. పలమనేరు కౌండిన్య అడవి నుంచి రెండేళ్ల కిందట పులిచెర్ల మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు విడతలవారీగా పంటలపై పడుతోంది. ప్రధానంగా వరి పంటకు అపారనష్టం వాటిల్లింది. రెండు నెలల కిందట మరోమారు మండలంలోకి ప్రవేశించిన 16 ఏనుగుల గుంపు పగటిపూట అడవిలో ఉంటూ రాత్రివేళ రెండు, మూడు బృందాలుగా విడిపోయి పంటలపై పడుతున్నాయి. ఆదివారం రాత్రి మండలంలోని అయ్యావాండ్లపల్లె, దేవళంపేట, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, పాళెం పంచాయతీల్లోని పలువురు రైతుల వరి పంటలను ధ్వంసం చేశాయి. అయ్యావాండ్లపల్లెలోని ధనంజయకు చెందిన ఎకరా వరి, చిన్నరెడ్డెప్పకు చెందిన ఎకరా వరి, కౌలు రైతు యల్లప్పకు చెందిన అర ఎకరా వరి, ఎర్రంవాండ్లపల్లెలోని నారాయణకు చెందిన అర ఎకరా వరి, మంగళపల్లెలోని రైతు కృష్ణయ్యకు చెందిన ఎకరా వరిని ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. దేవళంపేట పంచాయతీ మునిరెడ్డిగారిపల్లెలోని మునస్వామిరెడ్డికి చెందిన మామిడితోట కంచెకు అమర్చిన 10 రాతి కూసాలను విరిచేశాయి. దిన్నెబెస్తపల్లెలోని వెంకటస్వామికి చెందిన అర ఎకరా వరి, కొక్కువారిపల్లెలోని గౌరీప్రసాద్‌నాయుడికి చెందిన ఎకరా వరి, ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీ గేటుకాడబెస్తపల్లెలోని మునిచంద్రకు చెందిన అర ఎకరా వరి, పాళెం పంచాయతీ కొంగరవారిపలల్లెలోని సురేంద్ర నాయుడికి చెందిన అర ఎకరా వరి, రామనాధం నాయుడికి చెందిన ఎకరా పశుగ్రాసాన్ని తొక్కి నాశనం చేశాయి. గురువారం ఉదయం సుమారు 15 ఏనుగుల గుంపు గుట్టమీదపల్లె, పాళెం మీదుగా తూర్పు విభాగం అడవిలోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. తూర్పు అటవీ విభాగం ప్రాంతంలో ధ్వంసమైన పంటలను ఎఫ్ఆర్‌వో థామస్‌కుమార్, మంగళంపేట సెక్షన్ ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మున్నా పరిశీలిస్తున్నారు. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలో మాత్రం ఐరాల సెక్షన్ ఎఫ్‌బీఓవో శ్రీదేవి మినహా మిగిలిన అధికారులెవరూ పరిశీలించిన దాఖలాలు లేవు. మరోవైపు పంటలకు నష్ట పరిహారం మొక్కుబడిగా చెల్లిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో స్థానికులకు టైంస్లాట్

శ్రీకాళహస్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానిక భక్తులకు దర్శనానికి సంబంధించి ప్రత్యేక టైంస్లాట్ కేటాయిస్తూ ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 నుంచి 7.30గంటల వరకు సాయంత్రం 7నుంచి 8.30గంటల వరకు స్థానికులు ముక్కంటి ఆలయంలో కంచుగడప నుంచి ఎలాంటి టిక్కెట్టు లేకుండా ప్రవేశించే విధంగా టైంస్లాట్ అమలు చేయనున్నట్టు ఈవో పేర్కొన్నారు. నాల్గో గేట్‌లోని పీఆర్వో కార్యాలయం వద్ద ఆధార్‌కార్డుతో నమోదు చేసుకున్న స్థానిక భక్తులను కంచుగడప వద్ద అనుమతించనున్నారు.ప్రస్తుతం నాల్గో గేట్‌లో పీఆర్వో కార్యాలయం ఉంది. అయితే స్థానిక భక్తులకోసం 1వగేటు వద్ద మూడు రోజుల్లో అదనపు పీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేస్తామని ఈవో తెలిపారు.

ఆధార్‌తో దర్శనాలా..?

స్థానిక భక్తులకు ఆధార్‌కార్డుతో శ్రీకాళహస్తీశ్వరస్వామి దర్శనం చేసుకునేలా నిర్ణయం సరికాదని ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు చిట్టివేలు జయగోపాల్ అన్నారు. స్థానిక భక్తులు ఉదయం నుంచి రాత్రి ఏకాంత సేవ వరకు వస్తుంటారన్నారు. మహిళలు, వృద్ధులు తమ ఆధార్‌కార్డును దక్షిణ గోపురం వద్ద ఉన్న పీఆర్వో కార్యాలయంలో చూపించి స్లిప్పు తీసుకుని మళ్లీ స్వామి అమ్మవార్ల దర్శనానికి కంచు గడప వద్ద సాధారణ క్యూలైన్‌లో పంపించే నిర్ణయం సరికాదన్నారు. దీని వలన ఆలయానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించి ఈ నిర్ణయం పునఃసమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు.

పులికాట్‌కు జలకళ



సూళ్లూరుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు నీరులేక ఎడారిని తలపించిన తిరుపతి జిల్లాలోని పులికాట్ సరస్సు బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షంతో జలకళ సంతరించుకొంది. వర్షంతో పాటు మధ్యాహ్నం నుంచి తేలికపాటి ఈదురు గాలులు తోడవ్వడంతో సరస్సులోకి ఎగువ ప్రాంతం నుంచి కూడా నీరుచేరింది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో కుదిరి, అట్టకానితిప్ప వద్ద సరస్సులో అలల ఉధృతి సముద్రాన్ని తలపిస్తోంది. పులికాట్ జలకళ రావడంతో పాటు తీరం వెంబడి చల్లని గాలులతో కూడిన వాతావరణం ఉండడంతో జాలర్లు చేపల వేట సాగిస్తున్నారు.

సముద్రంలో అలల ఉధృతి


కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరంలో ఎగిసిపడుతున్న అలలు

కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఇప్పుడిప్పుడే సముద్రంలో అలల ఉధృతి పెరుగుతోంది. మూడు రోజులపాటు భారీ వర్ష సూచన.. అధికారుల హెచ్చరికల నేపథ్యంలో తిరుపతి జిల్లా కోట మండల పరిధిలో మత్స్యకారులు సోమవారం చేపల వేట నిలిపేశారు. దీంతో సముద్రంలో నుంచి పడవలు, వలలు, ఒడ్డుకు చేరాయి. సముద్రతీర ప్రాంత గ్రామాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించారు. ఇక, సోమవారం తెల్లవారుజాము నుంచే గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, కొత్తపట్నం, సముద్రపు వెంబడి గ్రామాల్లో ఈదురుగాలులు, ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం ఎక్కడ అల్పపీడనంగా మారి తీవ్ర తుఫాను వల్ల నష్టపోతామోనని కోట, చిట్టమూరు, వాకాడు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


చేపల వేట ఆపేయడంతో ఒడ్డునే ఉన్న పడవలు

శ్రీకాళహస్తికి దారెటు?

● ఆరులేన్ల జాతీయ రహదారిపై రాకపోకలు ప్రారంభం
● సూచికబోర్డులు లేక దారి తప్పుతున్న వాహనదారులు


ఊరందూరు వద్ద ఆరు లేన్ల హైవేపై వాహనాల రాకపోకలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తికి ఎలా వెళ్లాలి? ఈ ప్రశ్న నిత్యం ఆరులేన్ల జాతీయ రహదారిపై వాహనదారులను వేధిస్తోంది. రెండు వారాల క్రితం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో కొత్తగా నిర్మించిన ఆరులేన్ల జాతీయ రమదారిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. అయితే పట్టణంలోకి ప్రవేశించే ఇరువైపులా సూచికబోర్డులు లేకపోవడంతో వాహనదారులు వేగంగా ముందుకు వెళ్లిపోతున్నారు. దాంతో శ్రీకాళహస్తి పట్టణంలోకి చేరుకునేందుకు కనిపించిన వారినంతా అడగాల్సి వస్తోంది.

నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు ఆరులేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు మూడేళ్ల క్రితం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని పలు గ్రామీణ ప్రాంతాల మీదుగా ప్రారంభమైంది. తిరపతి నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోకి ప్రవేశించాల్సిన వాహనం మండలంలోని చెర్లోపల్లి వద్ద సర్వీసు రోడ్డు నుంచి సాగాల్సి ఉంది. ఇక్కడ సూచికబోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు నేరుగా వెళ్లిపోతున్నారు. దాంతో ఏపీటూరింజ ఫ్లై ఓవర్ ఎక్కిన వాహనాలు నేరుగా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు చేరుకుంటున్నాయి. ఇక్కడ దారి తప్పామని తెలుసుకుంటున్న వాహనదారులు స్థానికులను అడిగి శ్రీకాళహస్తి - పంగూరు రోడ్డు నుంచి పానగల్ మీదుగా పట్టణంలోకి చేరుకుంటున్నారు. ఈ మార్గంలో పానగల్ వద్ద రైల్వేగేటు ఉండటంతో దారి తప్పి వచ్చిన వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఇక మరికొందరు వాహనదారులు ఊరందూరు దాటుకుని నారాయణపురం, పెంకలపాడు, అరవకొత్తూరు మీదుగా శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని ఎస్‌వీఎస్ కల్యాణమండపం వద్ద సర్వీసు రోడ్డుకు మలుపు తీసుకుని పట్టణంలోకి చేరుకుంటున్నారు. మొత్తంగా తిరుపతి నుంచి పట్టణంలోకి రావాల్సిన వాహ నాలు సూచికబోర్డులు లేకపోడంతో 5 నుంచి 10 కిలోమీటర్ల దూరం అధికంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇక విధంగా నెల్లూరు, విజయవాడ నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోకి రావాల్సిన వాహనాల పరిస్థితి ఇదే. నెల్లూరు నుంచి వచ్చే వాహనదారులు తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం రైస్‌మిల్లు వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీసురోడ్డు మీదుగా పట్టణంలోకి ప్రవేశించాల్సి ఉంది. ఇక్కడా సూచిక బోర్డులు లేకపోవడంతో బసవయ్యపాళెం వద్ద వాహనాలు సర్వీసురోడ్డుకు మలుపు తిరగకుండా నేరుగా ఫ్లైఓవర్ మీద ప్రయాణం సాగిస్తున్నాయి. అక్కడి నుంచి జ్ఞానమ్మకండ్రిగ, శ్రీకాళహస్తి పట్టణ శివారు వీఎంపల్లి, జైహింద్ పురం, కాగితాల అరుంధతివాడ మీదుగా లంకమిట్ట, స్వర్ణముఖి నది వంతెన వరకు కొనసాగుతోంది. దాంతో బసవయ్యపాళెం వద్ద ముందుకు సాగిన వాహనాలు కొన్ని కిలోమీటర్లు తప్పనిసరి పరిస్థితుల్లో ముందుకు వెళ్లాల్సి వస్తోంది. ఆ తరువాత స్థానికులను అడిగి మళ్లీ పట్టణంలోకి రావాల్సి వస్తోంది. శ్రీకాళహస్తి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. కొత్త రోడ్డు కావడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక కొందరు గూగుల్‌మ్యాప్‌ను ఆశ్రయిస్తున్నప్పటికీ కొత్తరోడ్డుతో తీవ్ర గందరగోళానికి గురై గ్రామీణ ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పట్టణానికి ఇరువైపులా ప్రవేశమార్గాల వద్ద సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉంది.



జగమర్లలోని ప్రభుత్వ కార్యాలయాలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఖాదర్ బాషా

మూడు ప్రభుత్వ కార్యాలయాలకు తాళం

జగమర్లలో మూతేసి యువత నిరసన - దారి సమస్య తలెత్తడమే కారణం

పలమనేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని మూరుమూల అటవీగ్రామం జగమర్లలోని మూడు ప్రభుత్వ కార్యాలయాలకు దారి సమస్య తలెత్తింది. దీంతో ఆ గ్రామానికి చెందిన యువత ఆ కార్యాలయాలకు రెండ్రోజుల కిందట తాళం వేసింది. వివరాలిలా ఉన్నాయి. ఈ గ్రామంలో ఏపార్టీ అధికారంలో ఉంటే వారి హవా కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. మూరుమూల అటవీ గ్రామంగా వైసీపీ ప్రభుత్వం గుర్తించి రైతు భరోసాకేంద్రం, హెల్త్ సెంటర్, సచివాలయ భవనాల నిర్మాణాలకు రూ.60లక్షలు మంజూరు చేసింది. అయితే గ్రామంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో ఆ గ్రామ దివంగత మాజీ సర్పంచ్ సాంబశివారెడ్డి కుటుంబీకులు ముందుకొచ్చారు. ఈ భవనాల నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని తాము కొనుగోలు చేసి ఇస్తామన్నారు. స్థల దాతలుగా తమ కుటుంబాన్ని శిలాఫలకంలో పేర్కొనాలని షరతు పెట్టారు. అందుకు అప్పట్లో అధికారులు సమ్మతించారు. దాంతో నారాయణ రెడ్డికి చెందిన భూమిలో రూ.10లక్షలు వెచ్చించి దివంగత సాంబశివారెడ్డి కుటుంబ సభ్యులు భవనాల నిర్మాణానికి స్థలం కొనుగోలు చేసి ఇచ్చారు. అధికారులు కూడా వెంటనే మూడు భవనాలు నిర్మించారు. ఈ భవనాల వద్దకు వెళ్లడానికి ఇప్పటివరకు కూడా నారాయణరెడ్డి తన భూమిలోనే దారి అనధికారికంగా ఇచ్చారు. ఏం జరిగిందో తెలియదు గ్రామానికి చెందినవారికి, నారాయణ రెడ్డికి మధ్య వాగ్వాదాలు జరిగాయి. ఈ క్రమమంలో తన పట్టాభూమిలో దారి ఇవ్వలేనని, కార్యాలయాలకు ఇప్పటి వరకు వాడుతున్న దారిని నారాయణరెడ్డి మూసేశారు. ప్రభుత్వ భవనాలకు మరోవైపు గ్రామనత్తానికి చెందిన స్థలం ఉందని, అక్కడి నుంచి దారి ఉందని నారాయణరెడ్డి చెప్పారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు యువకులు రెండ్రోజుల కిందట ప్రభుత్వ కార్యాలయాలకు తాళం వేసి నిరసన తెలిపారు.

గ్రామస్తులతో చర్చించిన ఎంపీడీవో

సోమవారం కార్యాలయాకు వచ్చిన సిబ్బంది ఈ విషయాన్ని ఎంపీడీవో ఖాదర్‌బాషా దృష్టికి తీసుకెళ్లారు. ఆయనొచ్చి గ్రామస్తులతో చర్చించారు. ఇప్పటివరకు వెళ్తున్న దారే సౌకర్యంగా ఉందని, దాన్నే కొనసాగించాలని గ్రామస్తులు కొందరు ఎంపీడీవోకు చెప్పారు. అయితే నారాయణరెడ్డి కుటుంబీకులు మాత్రం భవనాలకు తమ పట్టా భూమిని ఇచ్చామని, అయితే దారి ఇవ్వాలన్న నిబంధన ఏమీ లేదన్నారు. ఈ కార్యాలయాలకు మరో దారి కూడా ఉండటంతో దాన్నే వినియోగించుకోవాలని సూచించారు. దీనిపై ఎంపీడీవోను విచారించగా, తాను ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. వారి సూచన మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడి అధికారులు దారి గురించి ఆలోచించకుండా, ఎటువంటి రాతకోతలు చేసుకోక పోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని స్థానికులు అంటున్నారు.

రాజకీయ వివాదమేనా?

ఈ గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్, ఈ పంచాయతీ పరిధిలోనే ఉన్న ఎస్టీ కాలనీకి చెందిన రోజా ఎంపీపీగా ఉన్నారు. వారు మాత్రం ఇది కేవలం రాజకీయప్రత్యర్థులు తీసుకొచ్చిన వివాదంగా ఆరోపిస్తున్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కుప్పం, అక్టోబరు14, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిగచీనేపల్లె గ్రామానికి చెందిన సంతోశ్ కొన్నిరోజుల క్రితం మృతి చెందాడు. ఆయనకు 10 సంవత్సరాలలోపు వయసు కలిగిన ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దళిత నాయకుడు, కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ సోమవారం ఆ కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ సాయం

రామకుప్పం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ఎస్.గొల్లపల్లెకు చెందిన మునివెంకటమ్మ సోమవారం అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ గంట్లప్పగౌడు, తెలుగు యువత అధ్యక్షులు విశ్వనాథ్‌లు పార్టీ నేతలతో కలసి నివాళులర్పించారు. టీడీపీ తరపున మృతురాలి కుటుంబానికి రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు.



నేటి నుంచి పింఛన్ సర్వే

రామకుప్పం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల పరిధిలో మంగళవారం నుంచి ఫించన్ సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంతం తెలిపారు. అర్హత కల్గిన ప్రతి ఒక్కరూ తమ వివ రాలను ఆయా గ్రామ సచివాలయాలో వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శుల వద్ద నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

17న ఎస్వీసీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చిత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన పలమనేరులోని ఎస్వీసీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తు న్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఈ మేళాలో ర్యాపిడో, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఫౌండే షన్, క్రెడిట్ యాక్సెస్, గ్రామీణ్ లిమిటెడ్ వారు పాల్గొంటారని తెలిపారు. కనీస విద్యార్హతగా టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయ్యి 18-35 సంత్సరాల్లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలాం విగ్రహ ఏర్పాటుకు సహకరించండి



కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన అయూబ్‌ఖాన్

పుంగనూరు రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సహకరించాలని మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం హెల్త్, ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పి.అయూబ్ ఖాన్ తెలిపారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలికిరిలో మాజీ సీఎం కిరణ్‌ను ఆయన స్వగృహంలో ట్రస్ట్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి తనవంతు సహకారం అందిస్తానని మాజీ సీఎం కిరణ్ చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు, అమరనారాయణ పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలుకు వేలం

పలమనేరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూమలను ఈ నెల 15వ తేదీ మంగళవారం కౌలుకు వేలం పాటలు నిర్వహి స్తున్నట్లు ఆలయ ఈఓ కమలాకర్ తెలిపారు. వేలం పాటలు ఆలయ ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని వేలంలో పాల్గొన దలచిన వారు రూ.1000 కట్టవలసి ఉంటుందని వివరించారు. గంగవరం సమీపంలోని 4.20 ఎకరాలు, రొంటకుంట్ల గ్రామ సమీపంలో మూడు సర్వే నంబర్లలోని మొత్తం 3.16 ఎకరాలను వేలం వేయనున్నట్లు తెలియజేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 8 మందికి జరిమానా

గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 8 మందికి పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి లిఖిత రూ. 64 వేలు జరిమానా విధించినట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు. మద్యం సేవించి డ్రైవ్ చేస్తూ పట్టుబడిన 6మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.60 వేలు, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి పట్టుబడిన వారికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధించినట్లు వివరించారు.

పుంగనూరు డిప్యూటీ తహసీల్దార్‌గా నాగేశ్వర్

పుంగనూరు రూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు డిప్యూటీ తహసీల్దార్‌గా నాగేశ్వర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసు న్న డీటీ తసీనా బదిలీ కావడంతో చౌడేపల్లెలో పనిచేస్తున్న నాగేశ్వర్ బది లీపై పుంగనూరుకు వచ్చినట్లు తెలిపారు. అలాగే పుంగనూరు ఆర్‌ఐగా పణి కుమార్, రీ సర్వే డీటీగా బాలాజీలు బాధ్యతలు చేపట్టారు.

సదుంలో కిక్కు లక్కు ఇద్దరికే

సదుం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు మద్యం దుకాణాలకు 25 దరఖాస్తులు అందిన విషయం తెలిసిందే. సోమవారం నిర్వహించిన లక్కీ డిప్‌లో షాపులను మహేశ్వరరెడ్డి, నారాయణ దక్కించుకున్నారు.

రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ



భూమిరెడ్డిగారిపల్లెలో
సీసీ రోడ్డు భూమి పూజలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

సదుం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం లోని 79 ఎ.చింతమాకుల పల్లె, ఊటుపల్లె గ్రామాల్లో రెండు సీసీ రోడ్ల నిర్మా ణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈవో పీఆర్ ఆర్‌డీ వరప్రసాద్, ఉపాధి ఏపీడీ శ్రీనివాసులు తెలిపారు.

లక్షలు వ్యయం చేసి నిర్మించారు

నీటి సరఫరా మరిచారు



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వినియోగంలోకి రాని మరుగుదొడ్లు

సోమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవర ణంలో రూ.6లక్షలు వ్యయం చేసి కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులు ఏడాది క్రితం పూర్తి చేశారు. అధికారులు మాత్రం మరుగుదొడ్లకు నీటిసౌకర్యం కల్పించడం మరిచారు. దీంతో వెలుగు, ఉపాధి కార్యాలయాల వద్దకు వివిధ పనులపై వచ్చే ప్రజలు మూత్రశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి శానిటరీ కాంప్లెక్స్‌లో నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

కడా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కుప్పం,అక్టోబరు14, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో కుప్పంలోని కడా కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్ జి.కిరణ్ (9700762765), వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ టీఎస్.రాజేంద్ర (7731808088)లు కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంటారన్నారు. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వారి నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇస్తే అధికార యంత్రాంగం సాయం వస్తుందని పీడీ కోరారు.

సదుంలో రూ.30 లక్షలకు ఐపీ

సదుం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సదుంకు చెందిన జి.బోయకొండ(34) అనే వ్యాపారి పీలేరు కోర్టులో రూ.30 లక్షలకు ఐపీ దాఖలు చేసినట్లు న్యాయవాది షౌకత్ అలీ తెలిపారు. సదుం వీఆర్‌ఆర్ కాలనీకి చెందిన గంగులప్ప కుమారుడు జి.బోయకొండ, అదేకాలనీకి చెందిన పి.గంగులమ్మ, ఎస్.గంగమ్మ, ఎస్.బాలాజీల వద్ద రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.30 లక్షలు ప్రామిసరీ నోట్ల ద్వారా అప్పులు చేశాడని షౌకత్ అలీ తెలిపారు. వ్యాపారంలో నష్టాల కారణంగా అతను అప్పులు చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఐపీ దాఖలు చేసినట్లు వివరించారు.

వైన్ షాపుల కేటాయింపు

చౌడేపల్లె, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె మండ లంలో 3 మద్యం షాపులకు 37 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ షాపు నంబర్-67కు 10, షాపు నంబర్-68కి 13, షాపు నంబర్- 69కి 14 మంది దరఖాస్తు చేసున్నట్లు వివరించారు. చిత్తూరులో నిర్వహించిన లక్కీ డిప్ ద్వారా 67వ నంబర్ షాపును గణేష్‌నాయుడు, 68వషాపును తులసి రామ్, 69వ షాపు ను ఇంద్రప్రకాష్ దక్కించుకున్నట్లు వివరించారు. కాగా మద్యం షాపుల కిక్కులో లక్కు స్థానికులకు దక్కలేదు.

అగ్నిప్రమాదంలో రూ.లక్ష ఆస్తినష్టం



పలమనేరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు పాతపేట జండామఠంలో నివాసముంటున్న ఆరిఫ్ ఇంట్లో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.లక్ష విలువ చేసే గృహోపకరణాలు, దుస్తులు, విలువైన వస్తువులు కాలిపోయాయి. అగ్ని మాపక అధికారులు, సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉందని అగ్నిమాపక అధికారి మనోగరన్ తెలిపారు. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది నరేష్, రెడ్డెప్పరెడ్డి, ఎస్.పాండ్యన్, ఆరోన్ పాల్గొన్నారు.

నేటి మండల మీట్ వాయిదా

కల్లూరు, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉద యం 11 గంటలకు జరగవలసిన సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మండల మీట్ వాయిదా వేస్తున్నామని వివరించారు.

విద్యుత్ ఇనుప స్తంభాల వద్ద జాగ్రత్త పాటించాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా విద్యుత్ ఇనుప స్తంభాలకు ప్రజలు, పిల్లలు జాగ్రత్తలు దూరంగా ఉండాలని పుంగనూరు ఎస్పీడీసీఎల్ ఏఈ ఎం.మహేంద్రరెడ్డి కోరారు. సోమ వారం ఆయన మాట్లాడుతూ తుపాన్ వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడితే ప్రజలు పుంగనూరు సబ్ స్టేషన్‌కు 9490615107, మంగళం సబ్‌స్టేషన్‌కు 8712625805, ఎప్ఎస్‌పేట సబ్‌స్టేషన్‌కు 87126 25806లకు సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

ఐదుగురికి కిక్కు.. లక్కు

పుంగనూరు రూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు మున్సిపల్ పరిధిలోని ఆరు మద్యం షాపు లకు 56మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సురే శ్‌రెడ్డి తెలిపారు. సోమవారం చిత్తూరు సమీపంలోని ఆర్‌ఆర్‌గార్డెన్స్‌లో లాటరీ ద్వారా దుకాణాలు కేటాయిం చారు. షాపు నంబరు-1ని కె.బి.రవి, షాపు నంబరు-2, 5లను రవిశేఖర్, షాపు నంబర్ -3ను బాలసుబ్రహ్మ ణ్యం, షాపు నంబరు-4ను ఆదినారాయణ, షాపు నం బరు -6ను సి.వెంకటరమణారెడ్డి దక్కించుకున్నట్లు వివ రించారు. ఒకే వ్యక్తికి రెండు షాపులు దక్కడం విశేషం.

అభివృద్ధికి నోచని కుప్పం మున్సిపల్ పార్క్



కుప్పం మున్సిపల్ పార్క్, ఇసుక కూడా లేని జారుడు బండ, చెత్తతో నిండిన మురుగు కాలువ

కుప్పం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : కుప్పం మున్సిపల్ పార్క్ (రాజావారి పార్క్) అభివృద్ధికి నోచుకోవడంలేదు. కుప్పం నడి బొడ్డున, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా గల ఈ పార్క్‌ను పట్టించు కునే నాథులే కరవయ్యారు. కాస్త ఆహ్లాదకరంగా గడపాలన్నా, పిల్లలను సెలవు రోజుల్లో అలా తీసుకుని వెళ్లాలన్నా, ఈ పార్క్ ఏమాత్రం ఉపయోగపడడంలేదు. ఏళ్లనాటి భారీ వృక్షాలు ఉన్నాయి కానీ, మున్సిపల్ పార్కులో ఇతర మొక్కల పెంపకం లేదా లాన్ నిర్వహణ లేదు.

కుప్పం మున్సిపల్ పార్కులో ఉండడానికి అన్నీ ఉన్నట్లే అనిపిస్తాయి కానీ కనీస సౌకర్యాలు లేవు. ఎక్కడైనా పార్క్ అంటే కనీసమైన పూల మొక్కలు ఉంటాయి. ఆహ్లాదపరిచే మొక్కలతో అందంగా ఉంటుంది. కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేదు. ఉన్న కొద్దిపాటి బెంచీలలో అక్కడక్కడ కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకోవడానికి తప్ప ఇంకెందుకూ ఈ పార్కు పనికిరాదు. పిల్లలు ఆడుకోవడానికి కనీసమ్మైన ఆటల పరికరాలు కానీ, క్రీడా పరిక రాలు లేవు. ఫౌంటెన్ ఉన్నా అది దిష్టిబొమ్మలా మాత్రమే మిగిలింది. పని చేయడం లేదు. ఇక వాకింగ్ ట్రాక్ అని ఉన్నది కానీ, మట్టి ఇది మట్టి మార్గం మాత్ర మే. చిరు జల్లు పడినా దీనిమీద నడి చేందుకు వీలుకాదు. మురుగు కాలువలు కూడా పార్కు ప్రహరీని ఆనుకుని లోపలివైపు ఉన్నాయి. ఇందులో చెత్తాచెదారం పేరుకు పోయింది. మూత్ర శాలలు లేవు. ఈ కాలు వలే మూత్రశాలలుగా మారిపోయాయి. తాగునీటి సౌకర్యం లేదు. కనీసం ఒక్క పబ్లిక ట్యాప్ ఏర్పాటు చేయలేదు. స్మార్ట్ కుప్పం ప్రాజెక్టులో భాగంగా ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు వచ్చి మున్సిపల్ పార్క్‌ను సైతం పరిశీలించి వెళ్లారు. కుప్పం అభివృద్ధిలో భాగంగా ఈ పార్కును కూడా అభివృద్ధి చేయా లని నిర్ణయించారు. అయితే ఈ అభివృద్ధి ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా చేయాలని కుప్పం కోరుతున్నారు.



మట్టి వాకింగ్ ట్రాక్

పనిచేయని ఫౌంటెన్

పాడైపోయిన జిమ్ పరికరాలు

వాల్మీకి జయంతిని రాష్ట్రపండుగగా ప్రకటించడంపై హర్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్‌ఎం, వాల్మీకి నాయకులు

కుప్పం,అక్టోబరు14, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని రాష్ట్రపండుగగా ప్రకటించడంపట్ల వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కుప్పంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నంతోపాటు వాల్మీకి నేతలు ప్రేమ్‌కుమార్, బేటప్పనాయుడు తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాల్మీకి జయంతిని రాష్ట్రపండుగగా ప్రకటించడానికి కారకులైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎస్టీ హోదా కల్పిస్తామని జగన్ వాల్మీకులను నట్టేట ముంచారని విమర్శించారు. వాల్మీకుల చిరకాల వాంఛ అయిన ఎస్టీ హోదాను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కుప్పంలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేయడంతోపాటు అసంపూర్తిగా ఉన్న వాల్మీకి భవన్‌కు అదనపు నిధులు కేటాయించి పూర్తి చేయించి చంద్రబాబుతో ప్రారంభోత్సవం చేయిస్తామని తెలిపారు. వాల్మీకి జయంతిని ఈ నెల 17న ఎన్టీఆర్ విగ్రహం కూడలిలో ఘనంగా నిర్వహి స్తామని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు జిమ్ దాము, సురేశ్, మున్సిపల్ వాల్మీకి సంఘం అధ్యక్షుడు జయరాంనాయుడు, గుడుపల్లె అధ్యక్షుడు మునిరత్నం, కుప్పం అధ్యక్షుడు సూరి, రామకుప్పం అధ్యక్షుడు గిరిదాస్, నాయకులు గోవింద స్వామి, రామచంద్ర, ప్రభాకర్, మంజు, సురేశ్, సంతానం తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు సర్‌ఖాజీగా మౌలానా మహమ్మద్



మౌలానా మహమ్మద్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి


పుంగనూరు, అక్టోబరు14(ఆంధ్ర జ్యోతి): పుంగనూరు సర్‌ఖాజీగా పట్టణా నికి చెందిన డాక్టర్ మౌలానా మహమ్మ ద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మైనా ర్టీ ప్రధాకార్యదర్శి హర్షవర్దన్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం రొంపిచెర్లలో నియామక పత్రాన్ని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మౌలానా మహమ్మద్ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషిచేసిన టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, మైనార్టీ నాయకులు సుహేల్‌బాషా, సద్దాంహుసేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గడ్డూరులో ఘనంగా సల్లాపురెమ్మ ఉత్సవం



బైరెడ్డిపల్లె, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గడ్డూరుగ్రామంలో వున్న సల్లాపురెమ్మ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో ప్రధానమైన పూలగెరిగె ఉత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సల్లాపురెమ్మకు అర్చకులు విశే షాలంకరణ చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మ వారి ఉత్సవవిగ్రహానికి విశేషాలంకరణచేసి మేళతాళాలు, డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. అలాగే ఉపవాస దీక్షలో వున్న కళాకారుడు పూలగెరిగెను ఊరేగిస్తూ చేసిన విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు విజయమ్మ, మునికృష్ణప్ప ఏర్పాట్లను పర్య వేక్షించారు. ఆలయంవద్ద అన్నదానం చేశారు.

పంచాయతీల బలోపేతమే లక్ష్యం



కందూరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సోమల, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): పంచాయతీల బలోపేతమే లక్ష్యంగా ప్రభు త్వం పనిచేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు పేర్కొన్నారు. సోమవారం కందూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు అధికారులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో దినకర్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులు, సుబ్బ రాయుడు, భాగ్యమ్మ, కార్యదర్శులు జయశంకర్, వెంకటరమణ, నాగభూషణం పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా పెట్టుకోవాలి



ఆవులపల్లెలో వైద్యపరీక్షలు చేస్తున్నడాక్టర్ సోనియా

సోమల, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా వర్షాలకు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని పెద్ద ఉప్పరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి సోనియా పేర్కొ న్నారు. సోమవారం ఆవులపల్లెలో వైద్యశిబిరం నిర్వ హించారు. 55 మందికి వైద్యపరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ బాలాజీ, అంజమ్మ, స్వర్ణ, హేమలత పాల్గొన్నారు.

రేపు రొంపిచెర్ల మండల మీట్

రొంపిచెర్ల, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన 16వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సమావేశం జరుగుతుందని ఎంపీడీవో రాజేంద్ర శనివారం తెలిపారు. మండలానికి సంబం ధించిన పూర్తి సమాచారంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలోని గ్రామదేవత ముత్యాలమ్మకు అమావాస్య పూజలు జరిగాయి. గ్రామానికి చెందిన పలువురు భక్తులు పూజలు చేశారు. చీర,సారె సమర్పించారు.

రేపు పలమనేరు మండల సమావేశం

పలమనేరు, అక్టోబరు14, (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 16వ తేదీ బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఖాదర్‌బాషా తెలిపారు. మండల అధ్యక్షురాలు రోజా అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ సాధారణ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు14(ఆంధ్రజోతి): పుంగనూరు- పలమనేరు మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన ఆదివారం రాత్రి పుంగనూరు సమీపంలోని గూడూ రుపల్లె వద్ద జరిగింది. మండలంలోని గూడూరుపల్లెకు చెందిన నాగప్ప భార్య ఆదెమ్మ(75) రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు.

పంచాయతీ పాలనపై నేడు శిక్షణ

సదుం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీలలోని ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీ పాలనపై మంగళవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్‌ఆర్‌డీ వరప్రసాద్ తెలిపారు.

నిర్వాణనారాయణ స్వామికి విశేషపూజలు



పలమనేరు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని విష్ణుపురిలో వెలసిన నిర్వాణ నారాయణ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వ హించారు. సోమవారం మధ్యాహ్నం పాశాంకుశ శుక్లపక్ష ద్వాదసి సందర్భంగా ఈ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు భోగనాథం సురేష్ తీర్థప్రసాదాలు అందజేశారు.



చినుకు పడితే ప్రయాణం నరకమే..!

సోమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల సచివాలయం వద్ద రోడ్డుపై గుంతలు నీటితో నిండి ప్రయాణం నరకంగా మారింది. నంజంపేట వరకు పలు చోట్ల ఇలాంటి గుంతలు చినుకు పడితే చిత్తడిగా మారిపోతున్నాయి. సోమల దళితవాడ వద్ద రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో వాహన దారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



అటవీ అధికారులకు నెమలి అప్పగింత

మండలంలోని నారగల్లు పంచాయతీ కొత్తకోట గ్రామంలో మండల జనసేన అధ్యకుడు రూప్‌కుమార్ పొలంలో విద్యుత్‌షాక్ కుగురై పడిపోయిన నెమలిని గుర్తించి సోమవారం అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో అజిత్, రవి, దేవరాజులు పాల్గొన్నారు.

-గుడిపాల, ఆంధ్రజ్యోతి

జాతీయ రహదారి ఆక్రమణ

మండలంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో పాలమాకులపల్లె నుంచి శేషాపురం వరకు ఉన్న సర్వీసు రోడ్డును ఆక్రమించుకుని కొంతమంది ఇళ్ల నిర్మాణాలు, పశువులను కట్టేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు. - బంగారుపాళ్యం, ఆంధ్రజ్యోతి



సిమెంటు రోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని వీకేఆర్ పురం పంచాయతీ గుడ్డి కండ్రిగలో రూ.6.25 లక్షల విలువ చేసే సిమెంటు రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలోనూ సిమెంటు రోడ్ల ఏర్పాటుకు, డ్రైనేజీ సౌకర్యం కల్పించడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో సతీష్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర టీడీపీ మహిళా అధికార ప్రతినిధి మీర, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, మురళీరెడ్డి, మణిరెడ్డి, నారాయణస్వామి నాయుడు, ఉమాపతిరాజు, ధనంజయలురాజు, జగన్, దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరు చంద్రబాబు: థామస్



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి మారుపేరు ఏపీ సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. సోమవారం కార్వేటినగరం మండలంలో అల్లాగుంట, శెట్టిగుంట, పద్మసరస్సు లేఅవుట్ వద్ద జరిగిన పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రూ.12.68 కోట్లతో సిమెంటు రోడ్డు పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్వేటినగరం మండలంలో రూ.3.60 కోట్లతో 32 సీసీరోడ్లను తొలి విడతలో సుమారు 6.5 కి.మీ దూరం వేస్తున్నట్లు వివరించారు. ప్రతీ పల్లెకు రోడ్డు, డ్రైనేజీ వసతులు కల్పించడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. తమ సొంత గ్రామమైన అల్లాగుంట రోడ్డు సమస్య పరిష్కారానికి రూ.20లక్షలు కేటాయించినట్లు చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ఎంపీడీవో చంద్రమౌళి, ఈవో నాగరత్నమ్మ, టీడీపీ కార్వేటినగరం మండలాధ్యక్షుడు చెంగ్రాయయాదవ్, టీడీపీ నాయకుడు రాజా, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి యుగంధర్ పొన్న పాల్గొన్నారు.

పల్లెపండుగతో అభివృద్ధి బాటలు: జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా, అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం చిత్తూరు రూరల్‌లోని అనంతాపురం, అనగల్లు, పాలూరు, ముత్తుకూరు, తాళంబేడు క్రాస్ పంచాయతీల్లో నిర్వహించిన పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో పాల్గొని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెపండుగ పేరుతో ప్రతి ఆరు నెలలకొకసారి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఐదు గ్రామాల్లో రూ.60 లక్షల విలువైన 9 సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, రూరల్ మాజీ ఎంపీపీ జయచంద్ర నాయుడు, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జగదీశ్వర్ నాయుడు, శశికర్‌బాబు, మోహన్, మేషాక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ



ఆగరంలో పల్లెపండుగలో పాల్గొన్న అధికారులు, నాయకులు

నిండ్ర, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివప్రసాద్ వర్మ అన్నారు. సోమవారం మండలంలోని ఆగరం, ఓరూరుపేట, అత్తూరు పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, చెల్లమ్మ, జయంతి, మలరవేణి, ఈవోపీఆర్‌డీ లక్ష్మీపతి, నాయకులు వెంకటేశ్వరావు, రమేష్, కుప్పయ్య నాయుడు, సుబ్రమణ్యం పిళ్లై, గజేంద్ర నాయుడు, మనోహర్ నాయుడు, గిరి, లోకేష్, గాలి రమేష్ నాయుడు, పురుషోత్తం నాయుడు, కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత



సుబ్రమణ్యంరెడ్డికి టీడీపీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

శ్రీరంగరాజపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ పురం మండలం పిళ్లారికుప్పం పంచాయతీ మూలూరు గ్రామానికి చెందిన వైసీపీ నేత సుబ్రమణ్యంరెడ్డి సోమవారం పుల్లూరు క్రాస్ రోడ్డులో మండల టీడీపీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే థామస్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే థామస్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్ నాయుడు, ఎస్.కుమార్, మహేష్, చంద్రబాబురెడ్డి, సిద్దయ్యశెట్టి, బాలు, జలంధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా మిక్స్‌డ్ రిలేలో నగరి విద్యార్థి ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నగరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 4 నుంచి 6 తేదీ వరకు జరిగిన 27వ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీల్లో అండర్-20 విభాగంలో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి.జగదీష్ ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. 400 మీటర్ల మిక్స్‌డ్ రిలే పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. కళాశాలలో బీకాం(సీఏ)3వ సంవత్సరం చదువుతున్న జగదీష్‌ని కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ రెడ్డి నాయక్, పీడీ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు దిగాలంటే భయం

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు మార్గాల్లో వాహనచోదకులు రోడ్డు దిగాలంటే భయపడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో పాటు రోడ్డు పక్కన వర్షాలకు కోతలు ఏర్పడి గోతులమయంగా తయారయ్యాయి. ఎదురుగా బస్సులు, లారీలు, కార్లు వంటి వాహనాలు వచ్చిన సందర్భాల్లో పక్కకు దిగాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. మరమ్మతులు చేయకపోవడం వల్ల ప్రధానంగా ద్విచక్ర వాహనదారులకు పాట్లు తప్పలేదు. అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయి.పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరానికి వెళ్లే రోడ్డు, పచ్చికాపల్లం నుంచి వెదురుకుప్పంకు, వెదురుకుప్పంకు నుంచి దేవళంపేటకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా మరమ్మతు పనులు చేయాల్సి ఉంది.



వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో, దేవళంపేట మార్గంలో తంగేలిమిట్ట వద్ద రోడ్డు దుస్థితి

వైభవంగా కలశాల ఊరేగింపు



ఆలయ గర్భగుడిపై కలశాల ఏర్పాటుకు పూజలు



అంకాల పరమేశ్వరి బాలగురునాథస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజం పంచాయతీ క్రిష్ణంపల్లెలో అంకాల పరమేశ్వరి సమేత బాలగురునాథస్వామి చిత్రపటంతో పాటు కలశాలను అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. క్రిష్ణంపల్లెలో పోలు వంశస్థుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అంకాల పరమేశ్వరి సమేత బాలగురునాథస్వామి ఆలయ కుంభాభిషేకం పూజల్లో భాగంగా మూడవ రోజు సోమవారం యాజమాన్య సంకల్పం, మహా మంగళహారతి, శాంతి హోమం, గోపూజ, మహాపూర్ణాహుతి, కుంభాషేక జలసంప్రోక్షణ, విశ్వరూపదర్శనం, ప్రాణప్రతిష్ఠ, అర్చన పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ గోపురంపై ఏర్పాటుచేసే కలశాలు, గర్భగుడిలో ఏర్పాటుచేసే స్వామి, అమ్మవార్లు సంయుక్తంగా కలిగిన చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కలశాలను ప్రతిష్ఠింపజేసి, ఆలయంలో స్వామివార్ల చిత్రపటాన్ని ఏర్పాటుచేయడంతో కుంభాభిషేకం పూజలు ముగిశాయి. పూజల్లో పాల్గొన్న భక్తులకు, వివిధ గ్రామాలనుండి తరలివచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు.

నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోండి

- నగరపాలక కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- అత్యవసర సమయాల్లో 98499 07885కు కాల్ చేయండి
- కాలువలను పరిశీలించిన కమిషనర్



లోతట్టు ప్రాంతంలో కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో నగరంలో ఎక్కడా నీరు నిల్వ చేరకుండకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ నరసింహప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఉదయం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాలను పరిశీలించి సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. మిట్టూరులోని గంగినేని చెరువు మొరవకాల్వను పరిశీలించారు. కాలువలో అడ్డంకులు తొలగించాలని, ఆక్రమణల తొలగింపునకు సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అనంతరం సీఎంటీ రోడ్డులో మేజర్‌కాల్వను, ఎన్టీయార్ బస్టాండ్ వద్ద నిలిచిన నీటిని పరిశీలించారు. వర్షాలు మరో మూడు రోజుల పాటు పడే అవకాశమున్నందున క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరపాలక కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భారీ వర్షాలు రానున్నాయనే నేపథ్యంలో నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ నరసింహప్రసాద్ ప్రత్యేక కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. ముగ్గురు అధికారులు, మరో ముగ్గురు సహాయకులను నియమించి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రజలు కంట్రోల్ రూము నెంబరు 98499 07885కు సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా మేనేజర్, ఆర్వో, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆర్ఐలతో కూడిన హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. వార్డు కార్యదర్శులు కూడా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

తవణంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సుధాకర్ సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో వర్షాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు వాగులు, వంకలు, కల్వర్టులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రెడ్డిబాబు, మండల అధికారులు పాల్గొన్నారు.

పెనుమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, ఎలాంటి సంఘటనలు జరిగినా తక్షణమే సమాచారం ఇవ్వాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నీలకంఠేశ్వరరెడ్డి, విద్యుత్ ఏఈ తులసిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, పోలీసు అధికారి మధు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలసముద్రం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనదుర్గాపురం, మణిపురం ఎస్టీకాలనీల్లో పూరిగుడిసెల్లో నివాసం ఉంటున్న ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని తహసీల్దార్ అరుణకుమారి సూచించారు. రాబోవు మూడురోజులపాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సమీపంలోని ప్రభుత్వ పాఠశాల భవనాల్లోకి తరలివెళ్లాలని, సంబంధిత విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్‌కు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎలాంటి సమస్య ఏర్పడినా వెంటనే తహసీల్దార్ ఫోన్ నెంబరుకు సమాచారం అందజేయాలని కోరారు. మండల సర్వేయర్ గణేష్, వీఆర్వోలు శ్రీనివాసులు, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గుడిపాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ హెచ్చరికల సందర్భంగా అధికారులు పల్లెబాట పట్టారు. ఈ సందర్భంగా గుడిపాల, పాపసముద్రంలో వైద్యాధికారులు, సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, వైద్య సిబ్బంది అనూష, నాగలక్ష్మీ, విజయ, చంద్రమహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదమరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో వేణు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అల్పపీడనం నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ పారిశుధ్యం, తాగునీరు, వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు.

వరద ముప్పు పొంచి ఉంది.. అప్రమత్తంగా ఉండండి: భానుప్రకాష్



మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో చర్చిస్తున్న భానుప్రకాష్

నగరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం వరద ముప్పు పొంచి ఉందని, మున్సిపాలిటీలోని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశించారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షపాతం 25 మీమీ పైనే నమోదయ్యే అవకాశం ఉందని, పల్లపు ప్రాంతాల్లో అప్రమత్తత పాటించాలని అధికారులకు సూచించారు. వరద నీరు నిల్వ ఉండకుండా జేసీబీ సాయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రైనేజీలు పొంగి పొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే బాధితులకు అన్న పానీయాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా వంట సౌకర్యాన్ని సైతం అధికారులు చేపట్టాలని ఆయన కోరారు. సమావేశంలో నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు గుణశేఖర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా 'రేవా' నూతన పాలకవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాయల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(రేవా) సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక విజ్ఞాన సుధా డిగ్రీ కాలేజీలో జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పార్థసారథి నాయుడు, లీగల్ అడ్వయిజర్‌గా ప్రసన్నకుమార్, అధ్యక్షుడిగా పీఎంఆర్ ప్రభాకర్, జనరల్ సెక్రటరీగా మోహన్ కృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా సురేంద్రబాబు, యుగంధర్, చరణ్‌బాబు, జనార్ధన్, సత్యనారాయణ, ఆదిమూర్తి, మురళీమోహన్, జాయింట్‌సెక్రటరీగా ఉపేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరేష్‌బాబు ఎన్నికయ్యారు.

కొత్త ఆర్ఐగా ఏకాంబరం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల కొత్త ఆర్ఐగా ఏకాంబరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వెదురుకుప్పం మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కొత్త ఏఈగా ఈశ్వర్



గంగాధరనెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండల ఆర్‌డబ్ల్యూఎస్ కొత్త ఏఈగా సజ్జా ఈశ్వర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన తవణంపల్లె మండలంలో పనిచేస్తూ బదిలీపై గంగాధరనెల్లూరు మండలానికి వచ్చారు. గతంలో ఇక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తున్న గాయత్రి వెదురుకుప్పం మండలానికి బదిలీపై వెళ్లారు.

నేటి నుంచి డీపీఆర్సీ శిక్షణ తరగతులు

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు మెంబర్లకు డీపీఆర్సీ శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీవో చంద్రమౌళి సోమవారం తెలిపారు. రిఫ్రెషర్ ట్రైనింగుకు తప్పనిసరిగా హాజరు కావాలని, వచ్చే సమయంలో ఆధార్‌కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

ఈదురు గాలులకే పరిమితమైన తుఫాన్

విజయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం తుఫాన్ ప్రభావంతో మోస్తారు వర్షం కురిసింది. జిల్లా కలెక్టరు, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనల మేరకు మండలంలో తహసీల్దార్ కిరణ్, అధికార సిబ్బంది అప్రమత్తమయ్యారు. తుఫాన్ ఈదురు గాలులకే పరిమితమైంది.

17న ఎస్వీసీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన పలమనేరులోని ఎస్వీసీఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో ర్యాపిడో, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్, గ్రామీణ్ లిమిటెడ్ వారు పాల్గొంటారని తెలిపారు. కనీస విద్యార్హతగా టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయ్యి 18-35 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17న వెలుగుపూలు గ్రంథావిష్కరణ

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి ఆర్ఆర్ రెసిడెన్సీలో ఈనెల 17న డి.ఎస్.వి.రమేష్‌కుమార్ రచించిన వెలుగుపూలు కవితా సంకలన గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు హరివిల్లు లలిత కళావేదిక నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు బాబాకు పాలాభిషేకం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 14: కట్టమంచి విశ్వసాయి షిరిడి సాయిబాబాకు మంగళవారం పాలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ సి.కె.బాబు సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఓంశక్తి ఆలయంలో విశేష పూజలు



విశేష అలంకరణలో అమ్మవారు

నగరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని ఓంశక్తి ఆలయంలో సోమవారం వైభవంగా పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సుమారు 600మందికి పైగా అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు జ్యోతి నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నందీశ్వరుడికి పాలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

గంగాధరనెల్లూరు ఎంపీడీవోగా హరిప్రసాద్‌రెడ్డి



గంగాధరనెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఎంపీడీవోగా మారం హరిప్రసాద్ రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన యాదమరి మండలంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈవోపీఆర్‌డీతో పాటు ఎంపీడీవోగా ఈయనకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, ఆత్మ మాజీ ఛైర్మన్ దేవరాజులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యువరాజారెడ్డి, నేతలు జమీర్, ప్రభాకర్ నాయుడు, గోపి నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, మునిరత్నం నాయుడు, జాన్, చిదంబరం, సతీష్‌కుమార్, చిన్నా, మహేష్, సురేంద్రలు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డికి శాలువలు కప్పి, బొకేలు అందజేశారు.

తవణంపల్లె ఎంపీడీవోగా రెడ్డిబాబు



తవణంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవోగా రెడ్డిబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తవణంపల్లె ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్ పెద్దతిప్పసముద్రం మండల ఎంపీడీవోగా బదిలీపై వెళ్లగా, ఇదే కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న రెడ్డిబాబును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎంపీడీవోకి సత్కారం



ఎంపీడీవోని సత్కరిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవో అమరనాథ్‌ను సోమవారం మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లు శాలువ కప్పి సత్కరించారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సత్కరించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



ఇళ్లతుత్తూరులో సీసీరోడ్డు పనుల్లో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

విజయపురం, అక్టోబరు 14 (ఆంధ్ర జ్యోతి): పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని విజయపురం, ఇళ్లత్తూరు, ఆలపాకం, గంగమాంబాపురం, కాళికాపురం, పోతురాజులుకండ్రిగ, తెల్లగుంట, క్షూరికాపురం, కేవీపురం గ్రామాల్లో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణప్రకాష్, ఈవోపీఆర్డీ సురేంద్రకుమార్, సర్పంచ్‌లు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధికల్పనపై అవగాహన సదస్సు

యాదమరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనపై సోమవారం మండల సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎం ఈశ్వరమ్మ మాట్లాడుతూ డీడీయూ జీకేవై పథకం ద్వారా గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై శిక్షణ ఇచ్చి, ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించడమే లక్ష్యమన్నారు. జిల్లా టీడీపీఅధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు, సీడప్ ట్రైనర్ కవిత, చిట్టిబాబు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ బాధ్యతల స్వీకరణ

పెనుమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా అయ్యప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. జడ్పీ కార్యాలయంనుంచి బదిలీపై ఇక్కడకు విచ్చేసిన ఆయన్ను కార్యాలయ సిబ్బంది, స్థానికులు మర్యాదపూర్వకంగా కలిశారు.